హెచ్ఐసీసీలో హైలైఫ్ ఎగ్జిబిషన్ ప్రారంభం



మాదాపూర్: ప్రముఖ డిజైనర్లు రూపొందించిన వస్త్రాభరణాలు నగరవాసులను ఆకట్టుకుంటున్నాయి. మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న హైలైఫ్ ఎగ్జిబిషన్‌ను బుధవారం నటి వర్షిణీ సౌందర్‌రాజన్ నిర్వాహకుడు డొమినిక్‌తో కలసి ప్రారంభించారు. నగరవాసులను ఆకట్టుకునే విధంగా పలు రకాల నూతన మోడల్స్ అందుబాటులో ఉన్నాయని తెలిపారు. సమ్మర్ స్పెషల్ డ్రెస్‌మెటీరియల్స్, డ్రెసెస్‌లు ప్రత్యేకంగా ఉన్నాయన్నారు. వివాహాది శుభకార్యాలకు, పండుగలకు నూతన డిజైన్స్ ఆకర్షణగా నిలిస్తున్నాయన్నారు. డిజైనర్లు రూపొందించిన నగలు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో నటి శ్రవంతి చోకరపు, చాదిని బగ్వానానిలతో పలువురు మోడల్స్, డిజైనర్లు తదితరులు పాల్గొన్నారు.



గచ్చిబౌలిలోని శివసాయిక్షేత్రంలో..



అన్నపూర్ణాదేవి అమ్మవారికి ప్రత్యేక అలంకారం

ఘనంగా వసంతపంచమి వేడుకలు



సరస్వతీ దేవీకి పూజలు చేస్తున్న గ్రాండ్ వాసులు

రాయదుర్గం: వసంతపంచిమిని పురస్కరించుకొని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అందులో భాగంగా గచ్చిబౌలిలోని శివ సాయిక్షేత్రంలో ప్రత్యేక పూజలను చేశారు. ఉదయం ఆలయంలో అన్నపూర్ణాదేవి అమ్మవారికి, గణేషుడికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అష్టోత్తర పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం నూతన వస్త్రాలతో ప్రత్యేక అలంకారం చేశారు. అదేవిధంగా ఆలయంలోని షిర్డీసాయిబాబా, ఆంజనేయస్వామి, కాశీ విశ్వేశ్వరస్వామి వారికి కూడా ప్రత్యేక అభిషేకాలు, అలంకారం చేశారు.

శేరిలింగంపల్లి: నల్లగండ్లలోని అపర్ణ గ్రాండ్ సముదాయంలో వసంత పంచమి వేడుకలు వైభవంగా బుధవారం నిర్వహించారు. సరస్వతీ దేవీ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, చిన్నారులకు అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని చేపట్టారు. అపర్ణ గ్రాండ్ వాసులు డాక్టర్ బెహరా, శ్రీనివాసరాజు, బ్రహ్మానందం, మిలన్, నాయుడు, మేనేజింగ్ కమిటీ సభ్యులు అర్ణవ్, చేతనా, భట్టాచార్య, ఉత్తమ బెహరా, శక్తిసిన్హా, రీటా, ప్రియాంక, రూబీ, జూలీ, శంతను, లాహిరీ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలకు సర్కార్ ప్రోత్సాహం



కబడ్డీ క్రీడాకారులతో కాటా సుధారాణి

పటాన్‌చెరు: క్రీడలను కాంగ్రెస్ ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు కాటా సుధారాణి అన్నారు. బుధవారం మండల పరిధి ముత్తంగిలో సొంత ఖర్చులతో కొనుగోలు చేసిన జెర్సీ, షూస్‌ను కబడ్డీ క్రీడాకారులకు ఆమె అందించారు. ఈ జట్టు సూర్యాపేట జిల్లాలో 16వ తేదీ నుంచి 19 వరకు జరగబోయే 33వ సబ్ జూనియర్ రాష్ట్ర కబడ్డీ పోటీల్లో సంగారెడ్డి జిల్లా పాల్గొనను న్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్ ముక్తార్ జానీ, సెక్రటరీ అనంతరెడ్డి, ఎల్లయ్య, నరేందర్, శ్రీనివాస్ గౌడ్, శివయ్య, విఠల్, ఎంపీటీసీ గోపాల్, సందీప్ యాదవ్, భుజంగ రెడ్డి పాల్గొన్నారు.

పాఠశాలలో సమస్యలు బోలెడు



చందానగర్‌లోని వేమన వీకర్ సెక్షన్‌లోని ప్రాథమిక పాఠశాల

హఫీజ్‌పేట్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలను మన ఊరు మన బడిలో భాగంగా అభివృద్ధి చేస్తోంది. పేద విద్యార్థులకు ప్రైవేట్ పాఠశాలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యను అందించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్న నేపధ్యంలో వాటికి తగట్లుగా ప్రభుత్వ బడుల్లో విద్యార్థులకు మౌలిక వసతులు ఏర్పాటు కొరకు మన ఊరు మన బడి కార్యక్రమం ప్రారంభించింది. కానీ చందానగర్ డివిజన్ పరిధిలోని వేమన వీకర్ సెక్షన్‌లో ఉన్న ప్రాథమిక పాఠశాలలో కనీస వసతులు లేక విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. 2002లో ప్రారంభమైన పాఠశాల అప్పటి నుంచి నేటి వరకు పాఠశాలకు కావలసిన వసతులు పట్టించుకనే అధికారి, ప్రజాప్రతినిధులు కరువయ్యారు. 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు 47 మంది విద్యార్థులు ఉన్నారు. కానీ ఉపాధ్యాయులు 5 మంది ఉండాల్సిన చోట ఇద్దరు ఉన్నారు. ప్రజాప్రతినిధులకు పాఠశాల సమస్యలపై విన్నవించిన పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా 'మన ఊరు–మన బడి' కార్యక్రమంలో చందానగర్ వేమన వీకర్ సెక్షన్ ప్రభుత్వ పాఠశాలకు అభివృద్ధిలో చోటు కల్పించి వెంటనే పనులు ప్రారంభించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

సమస్యలు ఇవే....

- పాఠశాల చుట్టు ప్రహరీ లేక భయాందోళనలో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.
- రెండు గదులలోనే 1 నుంచి 5 తరగతి విద్యార్థులు ఉంటున్నారు.
- 5 తరగతులు విద్యార్థులు రెండు గదులలోనే కూర్చొని చదువుకోవల్సిన పరిస్థితి నెలకొంది.
- తాగడానికి మంచినీటి ట్యాంక్ లేదు, కేవలం ఒక బిందెలో ఉన్న నీటిని 50 మంది తాగాల్సిన పరిస్థితి ఏర్పడింది.

జ్ఞానసరస్వతికి ప్రత్యేక పూజలు



జ్ఞానసరస్వతీ దేవికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

మియాపూర్: జ్ఞానసరస్వతీ దేవికి ప్రత్యేక పూజలను చేశారు. మియాపూర్ ధర్మపురి శ్రీ జ్ఞాన సరస్వతి ఆలయంలో బుధవారం వసంతపంచమి సందర్భంగా ప్రత్యేక పూజలను నిర్వహించారు. జ్ఞాన సరస్వతీ దేవికి సుప్రభాతం, పంచామృత అభిషేకం, అలంకరణ కార్యక్రమాలను అర్చకులు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకురాలు భారతీయం సత్యవాణీ పర్యవేక్షణలో నిర్వహించారు.

ఘనంగా దామోదర సంజీవయ్య జయంతి

మూసాపేట: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మొట్టమొదటి దళిత ముఖ్యమంత్రి దామోదర సంజీవయ్య జయంతిని బుధవారం మూసాపేట గూడ్స్‌షెడ్‌రోడ్డులో అంబేడ్కర్ విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించారు. ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు కర్క నాగరాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా రాష్ట్ర దళిత నాయకులు కర్క పెంటయ్య పాల్గొని సంజీవయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సంజీవయ్య అత్యంత పేద కుటుంబలో పుట్టి ఎన్నో కష్టాలను ఎదుర్కొని అంచెలంచలుగా ఎదిగి ఉమ్మడి రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయ్యారన్నారు. మాజీ ప్రధానులు పండిత్ జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీ మన్ననలు పొందారన్నారు. ఈ కార్యక్రమంలో శారదారెడ్డి, అంబేడ్కర్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు కర్క డాకయ్య, బీసీ నాయకులు బాశెట్టి నర్సింగరావు, జెల్ల రాము, అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కర్క నిఖిల్, కర్క చిన్న సాయి, సదా మహేష్, కర్క మహేష్, పెరుమాండ్ల నర్సింగ్, ఖాన్, భాషా తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూ క్యాంపస్ స్కూల్ విద్యార్థిని ప్రతిభ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపల్ మురళి

రాయదుర్గం: చిన్నతనంలోనే చదువుతోపాటు పద్యాలు, కథలు రాయడంలో తనకుతానే సాటిగా హెచ్‌సీయూ క్యాంపస్ స్కూల్ విద్యార్థిని లైనాసింగ్ నిరూపించుకున్నారు. ఈ స్కూల్‌కు చెందిన లైనాసింగ్ 7వ తరగతి చదువుతోంది. ఆమె ఇటీవల ఒక కథ రాసింది. దాన్ని ప్రతిష్టాత్మకమైన 'బ్రిబుక్స్ డాట్‌కామ్' కథల పుస్తకంలో ప్రచురించడం విశేషం. ఈ నేపథ్యంలో బుధవారం స్కూల్‌లో ప్రిన్సిపల్ మురళి ఆధ్వర్యంలో లైనాసింగ్ రాసిన కథను ప్రచురించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. లైనాసింగ్‌ను స్ఫూర్తిగా తీసుకొని ప్రతి విద్యార్థి తమలోని నైపుణ్యాన్ని, సృజనాత్మకతక ఆలోచనలను ఉపాధ్యాయులతో పంచుకోవాలని సూచించారు.



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

తాండ్రకుమార్‌కు ఘన నివాళి

మియాపూర్: మతోన్మాదం, ఫాసిజంపై పోరాటమే తాండ్రకుమార్‌కు నివాళి అని ఎంసీపీఐ కార్యదర్శి మద్దికాయల అశోక్ ఓంకార్ తెలిపారు. తాండ్రకుమార్ ద్వితీయ వర్ధంతిని బుధవారం మియాపూర్‌లో నిర్వహించారు. మియాపూర్‌లో ఏర్పాటు చేసిన విగ్రహం నుంచి ఎంఏ నగర్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన చేసిన సేవలను గుర్చి వివరించారు. కార్యక్రమంలో కేంద్ర కమిటీ సభ్యులు శ్రావణపూడి నాగరాజు, కార్యదర్శి వర్గ సభ్యులు వనం సుధాకర్, వసుకుల మట్టయ్య, గోని కుమారస్వామి, పెద్దారపు రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల్లో నిబంధనలు పాటించండి

వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా



గాయపడిన కార్మికుడితో మాట్లాడుతున్న మంత్రి దామోదర

పటాన్‌చెరు టౌన్: పరిశ్రమలు నిబంధనలు పాటించాలని, ప్రమాదాలు జరగకుండా యాజమాన్యం పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సూచించారు. మంగళవారం సీఎంహెచ్ పరిశ్రమలో జరిగిన రియాక్టర్ బ్లాస్టింగ్‌లో ఐదుగురు గాయపడగా, పక్కనే ఉన్న వనమాలి పరిశ్రమలో 28 మంది కార్మికులు అస్వస్థతకు గురయ్యారు. ఇందులో ఒకరు మృతి చెందగా, ఇద్దరు పరిస్థితి విషమంగా ఉంది. మరొకరు 70 శాతం కాలిన గాయాలతో ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్నాడు. బుధవారం పటాన్‌చెరు ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కార్మికుడిని మంత్రి దామోదర పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరిశ్రమలో జరిగిన ప్రమాదంపై జిల్లాయంత్రాంగం పూర్తిస్థాయిలో దర్యాప్తు జరుపుతుందని తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ప్రతీ కార్మికుడిని కాపాడుకునే బాధ్యత పరిశ్రమల యాజమాన్యంపై ఉందని చెప్పారు. ప్రమాదాలు జరిగినప్పుడు త్వరితగతిన సాయం అందించేందుకు అవసరమైతే ప్రభుత్వం తరపున రెండు అంబులెన్సులు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కలెక్టర్ క్రాంతి, ఆర్డీఓ రవీందర్ రెడ్డి, జేసీ మాధురి, డీఎస్పీ రవీందర్ రెడ్డి, సీఐలు ప్రవీణ్ రెడ్డి, రవీందర్ రెడ్డి, ఎస్ఎస్‌యూఐ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు అవినాష్‌గౌడ్ పాల్గొన్నారు.

అడ్డగోలుగా రోడ్ల తవ్వకాలు

అనుమతులు లేకుండా దొడ్డిదారిన డ్రైనేజీ పైపులైన్ పనులు



భాగ్యనగర్‌కాలనీ ఫేజ్ 3లో రోడ్డును తవ్వి డ్రైనేజీ పైపులైన్‌పనులు చేపడుతున్న దృశ్యం



కోనసీమ వంటిల్లు హోటల్ ఎదురుగా రోడ్డును తవ్వి పనులు పూర్తి చేసిన దృశ్యం

భాగ్యనగర్‌కాలనీ: అసలే అధ్వానపు రహదారులు. ఎక్కడ చూసినా గుంతలు, ఇరుకు రోడ్లు. అధ్వానపు రోడ్ల దుస్థితిపై అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించరు. అయితే కొందరు స్వార్థ ప్రయోజనాల కోసం ప్రజలు అవసరాల కోసం వేసిన రోడ్లను ఇష్టానుసారంగా రాత్రికి రాత్రి తవ్వి పోస్తూ ప్రజా సొమ్మును దుర్వినియోగం పాలు చేస్తున్నారు. రోడ్డు తవ్వాలంటే జీహెచ్ఎంసీ అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. అయితే అటువంటి నిబంధనలు ఇక్కడి ప్రజలకు వర్తించవు. హైదర్‌నగర్ డివిజన్‌లో ఇటీవల కాలంలో ఎక్కడ చూసినా రహదారులను అడ్డగోలుగా తవ్వి పోస్తున్నారు.

- అండర్ గ్రౌండ్‌డ్రైనేజీ, మంచినీటి పైపులైన్లు పనుల కోసం జీహెచ్ఎంసీ, వాటర్ వర్క్స్ నుంచి ఎటువంటి అనుమతులు లేకుండానే ఇష్టానుసారంగా రోడ్లను తవ్వి పోస్తూ దర్జాగా పైపులైన్ పనులు చేపడుతున్నారు. లక్షలాది రూపాయలు వెచ్చించి ఇంటి నిర్మాణం చేపేట్టే యజమానులు పైపులైన్ పనులకు అనుమతులు తీసుకోకుండా ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. అంతేకాకుండా స్థానిక కాలనీ వాసులు, వాహనదారులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. హైదర్‌నగర్ డివిజన్ పరిధిలో ఇటీవల కోనసీమ వంటిల్లు హోటల్ ఎదరుగా ఓ భవన నిర్మాణదారుడు అదనపు ఫ్లోర్ నిర్మించి అక్రమంగా నిర్మాణం చేపట్టడమే కాకుండా దొడ్డిదారిన రోడ్డు తవ్వి డ్రైనేజీ పైపులైన్ పనులు ముగించాడు.
- అదే విధంగా భాగ్యనగర్‌కాలనీ ఫేజ్ 3లో రోడ్డును తవ్వి స్థానికులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఈ విషయమై స్థానికులు జీహెచ్ఎంసీ అధికారులకు సమాచారం అందజేసిన వారు అటువైపు కన్నెత్తి చూసిన పాపాన పోలేదు. అంతేకాకుండా వారి నుంచి ఆమ్యామ్యాలు దండుకొని వారిని ప్రోత్సహిస్తున్నట్లు కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. అక్రమంగా చేపడుతున్న పైపులైన్ పనులను జీహెచ్ఎంసీ వాటర్‌వర్క్స్ అధికారులు నిలువరించకపోతే రోడ్డు నిర్మాణం చేపట్టినా.. చేపట్టకపోయినా శూన్యంగానే మిగిలిపోతోంది.

గోల్ఫ్ లీగ్ ఫైనల్లో టీమ్ ఆల్ఫా, సామా ఏంజెల్స్



సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ ప్రీమియర్ గోల్ఫ్ లీగ్ తుది అంకానికి చేరింది. టైటిల్ ఫేవరెట్స్ టీమ్ ఆల్ఫా, సామా ఏంజెల్స్ ఫైనల్‌కు దూసుకెళ్ళాయి. హోరాహోరీగా సాగిన తొలి సెమీస్ లో టీమ్ ఆల్ఫా 60–50 స్కోర్ తో విలా జియో హైలాండర్స్ పై విజయం సాధించింది. రెండు జట్లూ నువ్వా నేనా అన్నట్టు తలపడడంతో స్కోర్లు సమమయ్యాయి. దీంతో ప్లే ఆఫ్స్ నిర్వహించారు. ప్లే ఆఫ్స్ లో టీమ్ ఆల్ఫాదే పైచేయిగా నిలిచింది. మరో సెమీస్ లో సామా ఏంజెల్స్ పూర్తి ఆధిపత్యం కనబరిచింది. ఏకపక్షంగా సాగిన మ్యాచ్ లో 50–30 స్కోర్ తో డీఎస్ఆర్ ది వరల్డ్ టీమ్ పై గెలుపొందింది. ఫిబ్రవరి 24న థాయ్ లాండ్ వేదికగా ఫైనల్ జరగనుంది. నాలుగో సీజన్ ఆరంభం నుంచి ప్రతీ టీమ్ అద్భుతంగా ఆడిందని, అత్యుత్తమ ప్రమాణాలతో హెచ్ పీజీఎల్ నిర్వహిస్తున్నట్లు లీగ్ కమిషనర్ డీఎస్ సుమన్ చెప్పారు. థాయ్ లాండ్ లోని వరల్డ్ టాప్ గోల్ఫ్ కోర్సులో టైటిల్ ఫైట్ మరింత రసవత్తరంగా సాగుతుందని చెప్పారు.

ప్రభుత్వ భూమిలో అక్రమంగా రోడ్డు

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారంలోని 1002 సర్వే నంబర్ ప్రభుత్వ భూమిని కొందరు కబ్జా చేసి రోడ్డు వేస్తున్నారని బుధవారం స్థానిక నాయకులు ఆరోపించారు. ఈ సందర్భంగా నరేష్, ప్రతాప్‌రెడ్డి, రాజిరెడ్డి, రమేశ్ మాట్లాడుతూ.. ఊట్ల గ్రామశివారులోని ఫాంహౌజ్‌లకు ప్రభుత్వ భూమిని కబ్జా చేసి రోడ్డు ఎలా వేస్తారని ప్రశ్నించారు. రోడ్డు నిర్మాణాన్ని తొలగించాలని రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని తెలిపారు. గ్రామానికి చెందిన ప్రభుత్వ భూములను కాపాడేందుకు రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

18న 'సండే ఈవినింగ్ టాక్'

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో ఈనెల 18న 'సండే ఈవినింగ్ టాక్' కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుంది. ఈ సందర్భంగా 'అప్రిషియేటివ్ ఇన్క్వైరీ' అనే అంశంపై టర్కీ దేశానికి చెందిన పర్సనల్ డెవలప్‌మెంట్ ట్రైనర్ యోగేష్‌శ్రద్ధా ప్రత్యేక ఉపన్యాసం చేస్తారు.

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో కూరగాయల ధరలు కిలో రూపాయల్లో... టమాట 20, పచ్చిమిర్చి 60, బెండ 60, కాకర 60, దొండ 60, దోస 30, ఆలు 30, చామ 60, కీర 30, బీర 60, వంకాయ 30, గోకర 60, బీన్స్ 50, బీట్‌రూట్ 40, క్యాప్సికమ్ 60, క్యాబేజీ 30, క్యారెట్ 40, చిక్కుడు 50, ఉల్లి 25(కేజీ), ములక్కాయలు (1)10 , క్యాలీఫ్లవర్ (1) 30, సొరకాయ (కేజీ) 20, అల్లం 200, వెల్లుల్లి 350.

మహిళలకు నైపుణ్య శిక్షణ కేంద్రం

హఫీజ్‌పేట్ : కొండాపూర్‌లోని సీఆర్ ఫౌండేషన్ నీలం రాజశేఖర రెడ్డి రీసర్చ్ సెంటర్‌లో ఉచితంగా మహిళలకు కంప్యూటర్ శిక్షణ కేంద్రం నిర్వహిస్తున్నారు. మహిళలకు స్వయం ఉపాధి కోసం టైలరింగ్, ఎంబ్రాయిడరీ, మగ్గం, డైయింగ్, ప్రింటింగ్, బ్యూటిషియన్, స్పొకెన్ ఇంగ్లీష్, కంప్యూటర్‌కు సంబంధించిన పరిజ్ఞానం, ట్యాలీ, డీటీపీ తదితర శిక్షణలు ఉచితంగా అందిస్తున్నారు. వివరాలకు 9603196925 నెంబరుకు ఫోన్ చేయవచ్చు.

ఇఫ్లూలో ఒకరోజు వర్క్‌షాప్

రాయదుర్గం: అకడమిక్, జర్నలిస్టిక్ రైటింగ్‌ను ఒకచోట చేర్చే ప్రయత్నం చేస్తున్నామని ఇఫ్లూ యూనివర్శిటీలోని ఫిల్మ్ స్టడీస్ విభాగం హెడ్ ప్రొఫెసర్ హెచ్ నిఖిల పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలోని యూనివర్శిటీ ఫిల్మ్ క్లబ్, స్టూడెంట్స్ వెల్ఫేర్ డీన్ ఆధ్వర్యంలో ఔట్‌రీచ్ ప్రోగ్రామ్‌లో భాగంగా ఫిల్మ్ రివ్యూలు రాయడంపై ఒక రోజు వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వివిధ విభాగాలకు చెందిన 40 మందికి పైగా విద్యార్థులు వర్క్‌షాప్‌లో పాల్గొన్నారని పేర్కొన్నారు. ఫిలిమ్ క్లబ్ విద్యార్థుల కోసం ఇలాంటి మరిన్ని కార్యక్రమాలను తీసుకువస్తుందన్నారు. అనంతరం కల్చరల్ యాక్టివిటీ సెంటర్‌లో 9 నిమిషాల నిడివి గల షార్ట్ ఫిల్మ్ హెయిర్ కట్ చిత్రాన్ని ప్రదర్శించారు.

ఘనంగా మైసమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం



ఆలయ వార్షికోత్సవంలో పాల్గొన్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు రవికుమార్‌యాదవ్

గచ్చిబౌలి: గచ్చిబౌలి ఇందిరానగర్‌లోని మైసమ్మ ఆలయ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు చేసి ప్రత్యేక అలంకారంతో భక్తులకు దర్శనం కల్పించారు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్‌యాదవ్ అమ్మవారిని దర్శించుకున్నారు.

పర్యావరణాన్ని కాపాడుకోవాలి



జ్యూట్ బ్యాగ్ బ్యాగులు పంపిణీ చేస్తున్న రవికుమార్ యాదవ్

హఫీజ్‌పేట్ : పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని శేరిలింగంపల్లి నియోజకవర్గ బీజేపీ నాయకుడు రవికుమార్ యాదవ్ పేర్కొన్నారు. బుధవారం శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని రాజీవ్ గృహకల్ప పాపిరెడ్డి నగర్ కూరగాయాల మార్కెట్‌లో జ్యూట్ బ్యాగుల సంచులు వాడుకలోకి తీసుకురావాలని ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ పార్టీ నాయకులు రమేష్, నరసింహ, శ్రీనివాస్, నర్సింగ్ యాదవ్, సుశీల, జ్యోతి, మీనా, కోటి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటా..

- నూతన డీఎస్పీ రవీందర్‌రెడ్డి



నూతన డీఎస్పీ రవీందర్‌రెడ్డితో సీఐలు

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు డీఎస్పీగా రవీందర్‌రెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు. డీటీసీ(డిస్ట్రిక్ ట్రైనింగ్ సెంటర్)లో డీఎస్పీగా విధులు నిర్వర్తించిన ఈయన ఇక్కడికి బదిలీ పై వచ్చారు. ఇంతకు ముందు ఇక్కడ విధులు నిర్వర్తించిన పురుషోత్తంరెడ్డి మల్కాజిగిరి ఏసీపీగా వెళ్లారు. ఈ సందర్భంగా రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ.. చోరీల నియంత్రణ కోసం సీసీ కెమెరాలను అన్నిచోట్ల ఏర్పాటు చేయాల్సి ఉందని చెప్పారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులందరికీ న్యాయం జరిగేలా చూస్తామని చెప్పారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ శాంతిభద్రతలు పరిరక్షణలో ముందుంటానని తెలిపారు. అనంతరం సీఐ ప్రవీణ్‌రెడ్డి, ట్రాఫిక్ రామకృష్ణారెడ్డి, బీడీఎల్ సీఐ రవీందర్, జిన్నారం, గుమ్మడిదల సీఐలు, సబ్ డివిజన్ ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి నానక్‌రాంగూడ రంగనాథుడి బ్రహ్మోత్సవాలు



రాయదుర్గం: నానక్‌రాంగూడ ఐటీకారిడార్‌లో శతాబ్దాల చరిత్ర కలిగిన రంగనాథ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలను ఈనెల శుక్రవారం నుంచి 23వ తేదీ వరకు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. శుక్రవారం సాయంత్రం 5.30 గంటల నుంచి రాత్రి 8.30 గంటల వరకు అంకురార్పణ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.